




● వెనక్కి వెళ్లిపోయే అవకాశం
● ఇప్పటికే 90శాతం స్మార్ట్ కార్డులు పంపిణీ
● జిల్లాలో 7,598 కొత్త కార్డులు

కార్డులు తీసుకోకపోతే అంతే..!

వైసీపీ హయాంలో నిత్యావసరాల పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేది. చాలావరకు పక్కదారి పట్టాయనే ఆరోపణలు లేకపోలేదు. కూటమి ప్రభుత్వం పారదర్శక పాలన నేపథ్యంలో పాత రేషన్ కార్డులకు స్వస్తి పలికింది. ఇదే క్రమంలో వీటి రూపంలో రాజముద్రతో పాటు క్యూఆర్ కోడ్, కుటుంబ పెద్దఫొటో తదితర సమగ్ర వివరాలతో కొత్త స్మార్ట్‌కార్డులకి శ్రీకారం చుట్టింది. ఆగస్టు నెల నుంచి పంపిణీ ప్రారంభమైంది. ఇప్పటికే 90శాతం పూర్తయింది. ఇంకా 58,572 కార్డులు కార్డుదారులకు అందాల్సి ఉంది. కార్డుదారులు త్వరపడి తీసుకెళ్లకపోతే అవి వెనక్కి వెళ్లే అవకాశముంది.

నంద్యాల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 5,32,570 స్మార్ట్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికే 4,73,613 కార్డులను ఆయా లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు అధికారిక లెక్కలు చెబు తున్నాయి. 90శాతం కార్డులను పంపిణీ చేసినట్లైంది. వీటిలో 7,598 కొత్త కార్డులు వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇంకా 10శాతం కార్డులు పంపిణీ చేయాల్సి ఉంది. ఈనెలాఖరికి మిగిలిన కార్డుదారులు ఆయా స్మార్ట్ కార్డులు తీసుకోవాలని, వివిధ కారణాల నేపథ్యంలో ఎవరైనా తీసుకోకపోతే అధికారులు వాటిని వెనక్కి పంపుతారు. దీంతో సదరు లబ్ధిదారులు కార్డు కోల్పోయే అవకాశం ఉంది. కావున త్వరపడండి.. ఆయా వారికి చెందిన కార్డులను పొందండి.



గతంలో ఎన్నో ఇబ్బందులు..

వైసీపీ పాలనలో ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరు కులు పంపిణీ చేసేవారు. ఈక్రమంలో చాలా వరకు పక్కదారి పట్టాయనే ఆరోప ణలు లేకపో లేదు. పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉండేదని సమాచారం. కూటమి ప్రభుత్వం పారదర్శక పాలన నేపథ్యంలో ఎండీయూ వాహనాల విధానానికి స్వస్తి పలికి డీలర్ల వ్యవ స్థకు శ్రీకారం చుట్టింది. ఇదేక్రమంలో సరికొత్త విధానంతో నిత్యావసర సరుకులు పక్కదారి పట్టకుండా ఉండాలనే లక్ష్యంతో సమగ్ర వివరాలతో స్మార్ట్‌కార్డులను పంపిణీ చేసింది.

స్పష్టత రాలేదు



ఎవరైనా వివిధ కారణాలతో స్మార్ట్‌కార్డు తీసుకోకపోతే రద్దు చేస్తారనే విషయంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. వీలైనంత త్వరగా స్మార్ట్‌కార్డులు తీసుకో వడం మంచిది. మిగిలిన 10శాతం కార్డుల పంపిణీపై మరింత శ్రద్ధపెట్టి పంపిణీ చేయిస్తాం. ఆ తర్వాత కూడా మిగిలిపోతే.. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తాం.

● కార్తీక్, జేసీ, నంద్యాల

డోన్, ఆళ్లగడ్డ, నందికొట్కూరు నియోజకవర్గాల్లో..

లబ్ధిదారులు స్మార్ట్ కార్డులను తీసుకోకపోతే అధికారులు వెనక్కి పంపుతారు. భవిష్యత్‌లో ఆయా లబ్ధిదారులు రేషన్‌కార్డులు కోల్పోయే ప్రమాదం ఉంది ఎక్కువగా ఆళ్లగడ్డ, డోన్, నందికొట్కూరు నియోజకవర్గ ప్రాంతాల్లో ఈ తరహా సమస్య ఉందని తెలుస్తోంది.

అవస్థలు ఉన్న నేపథ్యంలో..

ఎవరైనా రేషన్‌కార్డు పొందాలంటే ఎన్నో అవస్థలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో చాలామంది లబ్ధిదారులు స్మార్ట్‌కార్డులు తీసుకోలేదని తెలుస్తోంది. గత పాలకుల నిర్లక్ష్యం.. కార్డుదారులకు శాపంగా మారింది. ఎవరి రేషన్‌కార్డు ఎక్కడ ఉందో కూడా కొందరికి తెలియని పరిస్థితి. కొందరైతే జిల్లా నుంచి ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వలస వెళ్లడం, తదితర కారణాలతో పంపిణీ కొంత జాప్యమైనట్లు అధికార వర్గాల వాదన. చివరికి మిగిలిన 10శాతం పంపిణీ చేయాలని అధికార యంత్రాంగం భావించి కార్డులోని లబ్ధిదారుల్లో ఏఒక్కరైనా వచ్చి కార్డు తీసుకోవచ్చు అనే వెసులుబాటు కూడా కల్పించారు.ఇటు అధికారులు.. అటు లబ్ధిదారులు సైతం అప్రమత్తమై స్మార్ట్‌కార్డులు పంపిణీ 100శాతం అయ్యే విధంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఘనంగా భక్త కనకదాసు జయంతి



చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ, సిబ్బంది

నంద్యాల టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో భక్త కనకదాసు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎస్పీ సునీల్ షెరాన్ పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ.. భక్త కనకదాసు గొప్పకవి, సంగీతకారుడు, గొప్ప యోధుడని కొనియాడారు. ఆయన రచించిన కీర్తనలు, పాటలు, కథలు నీతి, వినయం సమానత్వాన్ని బోధిస్తున్నాయన్నారు. వారి ఆలోచనలు సాహిత్యం భక్తి నేటికి అన్ని తరాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐలు మోహన్‌రెడ్డి, సూర్యమౌలి, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లాంచీ ప్రయాణం.. ఆహ్లాదకరం

● 66 మందితో వచ్చిన టీఎస్ టూరిజం లాంచీ
● సోమశిల నుంచి శ్రీశైలానికి 120 కిలోమీటర్ల



శ్రీశైలం చేరుకున్న డబుల్ డెక్కర్ లాంచీ

శ్రీశైలం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లన్నను దర్శించుకునేందుకు కృష్ణానదిపై లాంచీ ప్రయాణం ఎంతో ఆహ్లాదకరంగా ఉందని యాత్రికులు హర్షం వ్యక్తంచేశారు. శనివారం ఉదయం 11గంటలకు సోమశిల నుంచి శ్రీశైలం బయలుదేరిన తెలంగాణ టూరిజం డబుల్ డెక్కర్ లాంచీ సాయంత్రం 6గంటలకు పాతాళగంగ వద్దకు సురక్షితంగా చేరుకుంది. కృష్ణానదిపై ఏడాది తరువాత పర్యాటకులకు అందుబాటులోకి వచ్చిన లాంచీ ప్రయాణం ప్రకృతి అందాలు, పచ్చదనం, వివిధ రకాల పక్షుల శబ్దాలు, చెంచు గూడెంలను చూస్తూ శ్రీశైలానికి చేరుకున్నట్లు ప్రయాణికులు తెలిపారు. 120 మంది సామర్థ్యం గల లాంచీలో 66 మందితో వచ్చారు. ఆదివారం ఉదయం సోమశిలకు తిరుగు ప్రయాణం అవుతామని టూరిజం అధికారులు తెలిపారు. సోమశిల నుంచి శ్రీశైలం వరకు జలమార్గం సుమారు 120 కిలోమీటర్లు ఉంటుంది.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

● యథావిధిగా ఆర్జిత సేవలు



దర్శనానికి క్యూలైన్లలో వెళ్తున్న భక్తులు

శ్రీశైలం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలానికి భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం రెండో శనివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి ఒక్కసారిగా భక్తులు తరలివచ్చారు. యాత్రికులు గదులు పొందటానికి ఇబ్బందులు పడ్డారు. దేవస్థానం నిర్వహించే వసతి గదులను ముందుగా ఆన్‌లైన్, సిఫారసు లేఖల ద్వారా బుకింగ్ చేసుకున్న వారికి కూడా గదులు లభించకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. వారాంతపు రోజుల్లో తెల్లవారుజాము నుంచే భక్తులందరికీ స్వామి అమ్మ వార్ల అలంకార దర్శనం మాత్రమే అందుబాటులో ఉంటుందని ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఆలయంలో జరిగే ఆర్జితసేవలు, హోమాలు, కల్యాణాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. కార్తీక మాసం సాయంత్రం వేళలో శాస్త్రోక్త పూజలు జరిపించి ధ్వజస్తంభంపై ఆకాశదీపాన్ని వెలిగించారు. ఆలయ దక్షిణ మాడవీధిలో ఏర్పాటు చేసిన కళారాధన వేదికపై హైదరాబాద్‌కు చెందిన పద్మజ సాంప్రదాయ నృత్య బృందం పలు భక్తిగీతాలకు చేసిన నృత్యాలు యాత్రికులను అలరించాయి.



నృత్యం చేస్తున్న కళాకారులు

రాయల్టీని తగ్గించాలి

● పెంపునకు వ్యతిరేకంగా ధర్నా
● పాల్గొన్న మైనింగ్, ట్రాక్టర్ల యజమానులు, కార్మికులు



రోడ్డుకు అడ్డుగా ట్రాక్టర్లను పెట్టి ధర్నా చేస్తున్న కార్మికులు

బనగానపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాయల్టీని తగ్గించాలని మైనింగ్, ట్రాక్టర్ల యజమానులు, కార్మికులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పలుకూరు క్రాస్ రోడ్డు వద్ద రాయల్టీ పెంపునకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. పలుకూరు, రామకృష్ణాపురం, గోవిందిన్నె, దేవనగర్ గ్రామాలకు చెందిన మైనింగ్, ట్రాక్టర్ల యజమానులు, మైనింగ్ కార్మికుల ఎరెండు గంటలకు పైగా ధర్నా నిర్వహించి ట్రాఫిక్‌ను స్తంభింపజేశారు. అటు కర్నూలుకు వెళ్లే వాహనాలు, ఇటు బనగనాపల్లెకు వచ్చే వాహ నాలు నిలిచిపోయాయి. ప్రైవేటు రాయల్టీలు వద్దు, ప్రభుత్వ రాయల్టీలు కావాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ట్రాఫిక్ స్తంభించడంతో బనగానపల్లె సీఐ మంజునాథరెడ్డి, నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఘటనాస్థలికి చేరుకొని వారికి నచ్చజెప్పి పంపించి వేశారు.

కోర్టు కానిస్టేబుళ్లు నిబద్ధతతో పనిచేయాలి

● ఎస్పీ సునీల్ షెరాన్



కోర్టు కానిస్టేబుళ్లతో సమావేశమైన ఎస్పీ సునీల్ షెరాన్

నంద్యాల టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కోర్టు కానిస్టేబుళ్లు నిబద్ధతతో పని చేయాలని ఎస్పీ సునీల్ షెరాన్ సూచించారు. శనివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో కోర్టు కానిస్టేబుళ్లతో, జిల్లా నేర ఘనంకాల సేకరణ, విశ్లేషణ, నిర్వహణ సంస్థ (డీసీఆర్‌బీ)తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ కోర్టు కానిస్టేబుళ్ల విధులు, ముఖ్యమైన కేసులో అభియోగ పత్రాలు దాఖలు సీసీ నెంబర్ల, సమన్లు వారెంటులు వాటి అమలు గురించి సూచనలు చేశారు. వీరే కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రతి కేసుకు సంబంధిచిన పత్రాలు సాక్ష్యాలు సమయానికి కోర్టుకు అందించాలన్నారు. జిల్లాలో ముఖ్యమైన కేసుల్లో తగిన పత్రాలు దాఖలు చేయడం అత్యంత కీలకమని అన్నారు. సీసీ నంబర్లు వీటిపై నిరంతరం పురోగతి, పర్యవేక్షణ ఉండాలని సూచించారు. కోర్టు సమన్స్, బెయిలబుల్ వారెంట్లు, అమలు విషయంలో ఎటువంటి ఆలస్యం కాకుండా కోర్టు ఆదేశాల ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. నాన్‌బెయిలబుల్ కేసుల ప్రధాన్యతను బట్టి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వాటి అమలుపై రిపోర్టులు సమర్పించాలని వారికి ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు, ఫింగర్‌ప్రింట్ ఎస్ఐ భరత్‌కుమార్, శ్రీనివాసరావు, కోర్టు లైసనింగ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు నుంచి వైజాగ్‌కు ప్రత్యేక బస్సులు

ప్రారంభించిన మంత్రి టీజీ భరత్

కర్నూలు రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ కర్నూలు నుంచి వైజాగ్‌కు మూడు ఏసీ బస్సులను ఏర్పాటు చేయగా శనివారం నగరంలోని ఆర్టీసీ కొత్తబస్టాండ్‌లో పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి వైజాగ్‌కు వెళ్లే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఏసీ సర్వీసులు అందుబాటులోకి తీసుకవచ్చామని వివరించారు. దీనివల్ల రెండు ప్రాంతాలకు అనుసంధానం పెరుగడమే కాకుండా టూరిజం పరంగా మరింత అభివృద్ధి జరుగుతుందని ఆయన అన్నారు. వైజాగ్‌కు బస్సు సర్వీసు కావాలని తెలిసిన వెంటనే ప్రతిపాదనలు పంపాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చి ప్రయాణికుల కోరిక మేరకు మూడు నూతన బస్సులను ఏర్పాటు చేసినట్లు మంత్రి వివరించారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన తనకు ఎంతో బాధ కలిగించిందని అన్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో ఆటోమేటిక్ స్ప్రింక్లర్ సిస్టమ్ బస్సులో ఉంటే ప్రాణపాయం జరగకుండా ఉంటుందన్నారు. ఈవిషయంపై ప్రధాని మోదీకి లేఖ రాసినట్లు చెప్పారు. త్వరలోనే ఢిల్లీ వెళ్లి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఆటో మెటిక్ స్ప్రింక్లర్ సిస్టమ్‌పై చర్చిస్తామని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు, డిపో మేనేజర్లు సుధారాణి, పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్

రక్త సేకరణపై దృష్టి ఏదీ?

● అలంకారప్రాయంగా రక్త సేకరణ బస్సు
● నిరుపయోగంగా యంత్రాలు



బ్లడ్‌బ్యాంక్‌లో నిరుపయోగంగా మిషన్లు

నంద్యాల హాస్పిటల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణ సర్వజన ఆస్పత్రిలో రోగులకు అవసరమైన రక్తాన్ని అందుబాటులో ఉంచాల్సిన బ్లడ్‌బ్యాంక్‌లో రక్తం కొరత ఏర్పడింది. బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది రక్తసేకరణపై దృష్టిసారించకపోవడం ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. జీజీహెచ్‌లో రక్తం తీసుకోవాలంటే డోనర్ కావాలంటూ సిబ్బంది రోగులను ఇబ్బంది పెడుతున్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తాన్ని స్టోర్ చేయాల్సి ఉండగా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా కేవలం రక్తశిబిరాల కోసం జీజీహెచ్‌లో ఒక బస్సును ఏర్పాటు చేశారు. కొన్ని నెలలనుంచి ఆ బస్సు నడవడంలేదని తెలుస్తోంది. బస్సు మరమ్మతులు ఉండటంతో జీజీహెచ్‌లో నిరుపయోగంగా ఉంది. రోగులకు అత్యవసర సమయాల్లో సంబంధిత బ్లడ్ గ్రూప్ రక్తం లేక సిబ్బంది చేతులెత్తేయడంతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం 450 పడకల జీజీహెచ్‌లో శనివారం కేవలం 58యూనిట్ల రక్తం ఉండటం గమనార్హం. రక్తం అందుబాటులో ఉండే బోర్డులో కూడా తేదీని మార్చే ఓపికలేకపోవడం శోచనీయం. బోర్డులో ఎ-పాజిటివ్ 10యూనిటట్లు, ఎ-నెగెటివ్ ఒక యూనిట్, బి-పాజిటివ్ 23యూనిట్లు, బి-నెగెటివ్ 4యూనిట్లు, ఓ-పాజిటివ్ 20యూనిట్లు ఉన్నట్లు రాశారు. ఓ-నెగెటివ్, ఎ.బి-పాజిటివ్, నెగెటివ్ యూనిట్లు జీజీహెచ్‌లో నిల్వలేదు. బ్లడ్‌బ్యాంక్‌ను ఆధుని కీకరణ మిషన్లతో ఏర్పాటుచేసి కాంపోనెంట్ మిషన్ ద్వారా రక్తాన్ని వేరుచేసి రోగులకు అందుబాటులో ఉంచా ల్సిన అధికారులు మూన్నెళ్లవుతున్నా అనుమతికోసం ఎదురు చూస్తున్నారు. దీంతో జీజీహెచ్‌లో దాదాపు 10మిషన్లు నిరుపయోగంగా ఉన్నాయి. బ్లడ్‌బ్యాంక్‌ను ఆధునికీకరణలో భాగంగా హడావుడిగా వరండాను రూముగా మార్చి ఏసీలు ఏర్పాటుచేసినా అవి పనిచేయడం లేదు. బ్లడ్‌బ్యాంక్ ద్వారా నెలకు రక్తదాన శిబిరాలతో 300పైగా యూనిట్లు సేకరించాలనే నిబంధన ఉంది.

రెడ్‌క్రాస్ రూటే వేరు

జిల్లాలో ఎక్కడైనా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తే అందులో సేకరించిన మొత్తం యూనిట్లలో 30శాతం యూనిట్లు జీజీహెచ్ లోని బ్లడ్‌బ్యాంక్‌కు ఇవ్వాల్సి ఉంది. అయితే నంద్యాలలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తసేకరణ నిధి ద్వారా సేకరించిన రక్తం యూనిట్లను నంద్యాల జీజీహెచ్ బ్లడ్‌బ్యాంక్‌కు ఇవ్వకుండా కర్నూలులోని జీజీహెచ్‌కు ఇవ్వడంలోని ఆంతర్యమేమిటని స్థానిక వైద్యవర్గాలు ప్రశ్నిస్తున్నాయి.

జీజీహెచ్‌లో రక్త సేకరణ, పంపిణీ సెన్సెస్ ఇలా

నెల	సేకరణ	పంపిణీ
జనవరి	244	261
ఫిబ్రవరి	256	258
మార్చి	248	279
ఏప్రిల్	384	292
మే	243	302
జూన్	227	293
జూలై	204	274
ఆగస్టు	225	242
సెప్టెంబరు	335	289
అక్టోబరు	89	262

బ్లడ్ స్టోరేజీ సెంటర్ల నిర్లక్ష్యం

జిల్లాలో ఆళ్లగడ్డ, బనగానపల్లె, కోవెలకుంట్ల, ఆత్మకూరు సీహెచ్‌సీలలో బ్లడ్ స్టోరేజీ సెంటర్లున్నాయి. అయితే గత 5నెలల్లో కేవలం 6రక్తదాన శిబిరాలు నిర్వహించారు. జూన్, జూలైలలో ఈ నాలుగు సెంటర్లలో ఒక్కశిబిరం కూడా నిర్వహించలేదు. ఆగస్టులో బనగానపల్లె రక్తదాన శిబిరంలో 33యూనిట్లు, కోవెలకుంట్ల 58యూనిట్లు సేకరించారు. సెప్టెంబరులో బనగానపల్లెలో 10, కోవెలకుంట్ల 25, ఆత్మకూరులో 31యూనిట్లు సేకరించారు. అక్టోబరులో ఆళ్లగడ్డలో మాత్రమే 20యూనిట్లు సేకరించారు. సీహెచ్‌సీల్లో ఉన్న సిబ్బంది రక్తదానశిబిరాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు దీన్నిబట్టి తెలుస్తోంది. జీజీహెచ్ బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది అక్టోబరులో యూనియన్ బ్యాంక్ సిబ్బంది ద్వారా 23యూనిట్లు సేకరించారు. బ్లడ్‌బ్యాంక్‌లో సిబ్బంది కొరత కూడా ఒకందుకు కారణం. నలుగురు ల్యాబ్ టెక్నీషియన్లు, ఒక కౌన్సెలర్ కొరత ఉంది. గత పదినెలల్లో 2525 యూనిట్లు సేకరించగా 2752యూనిట్లు పంపిణీచేసినట్లు బ్లడ్‌బ్యాంక్ గణాంకాలు తెలుపుతున్నాయి.

అన్నదాతలకు కడుపార భోజనం

● 2016 నుంచి 'రూ.15కే భోజనం' అమలు
● ఇస్కాన్ సహకారంతో నిర్వహిస్తున్న మార్కెట్ కమిటీ

7

తుంగభద్ర తీరం

సాహిత్యం

మానవీయ విలువల కవన పతాకం మంచికోసం



కర్నూలు కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'హితేన సహితం సాహిత్యం' అని శాస్త్రోక్తి. కవి అంటే కష్టజీవికి ఇరువైపులా ఉండి అండగా నిలిచేవాడు అని ఆధునిక నిర్వచనం. కవి తన భావజాలంతో అందమైన పంక్తులుగానే కాదు, అవసరమైతే మూఢ విశ్వాసాలను, అనాచారాలను చీల్చే గండ్రగొడ్డలిలా కూడా కలాన్ని వాడగలడు. సున్నితమైన మానవీయ విలువలను హృదయంలో నాటుకునేలా ప్రకటించగలడు. ఆ ప్రయత్నంలో 'మంచికోసం' కవితా సంపుటి రచయిత డాక్టర్ అనుగోలు సంజీవరాయుడు విజయం సాధించారని ఈ పుస్తకం చదివితే అవగతం అవుతుంది. వృత్తిరీత్యా రచయిత జడ్పీ ఉన్నత పాఠశాల, గోసానిపల్లె, డోన్ మండలం, నంద్యాల జిల్లాలో తెలుగు భాషోపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. తెలుగుభాష పట్ల ఎంతో మక్కువ ఉన్న ఆయన 'సూర్య చంద్ర పదాలు' ద్వారా తొలిసారిగా తన సృజనాత్మకతను అక్షర రూపంలో ప్రకటించారు. మేడిపండులాంటి సమాజంలోని లోపాలను ఎత్తిచూపుతూ, వాటికి పరిష్కార మార్గాలు చూపుతూ సంధించిన కవితా శరమే 'మంచికోసం'.

'నా కవితలు ఊహా జనితాలు కాదు/కాలక్షేపానికి అసలే కాదు/ఒకరి మెచ్చుకోలుకు కాదు/నిజాలు, నిజాలు, నగ్నసత్యాలు/ నా కవిత అభ్యుదయ కవిత' అంటూ సమకాలీన వర్తమాన సమాజ స్థితి గతులను విప్పి చెప్పాడు. ప్రకృతిని, సమాజాన్ని, సంస్కృతిని, ఆచారాలను, మూఢాచారాలను, ఆర్థిక అసమానతలను, యుద్ధాలను, శాంతిని, ఐక్యతను, సామరస్యాన్ని, సమహజీవనాన్ని, స్వేచ్ఛను, తెలుగు భాషను, తెలుగు గడ్డను ఇలా ఒకటేమిటి విభిన్న అంశాలతో 84 వచన కవితలతో కూర్చిన కవితా సంపుటి 'మంచికోసం'.

రచయిత డాక్టర్ అనుగోలు సంజీవరాయుడు దేవులపల్లి కృష్ణశాస్త్రి బాటలో సౌందర్య ప్రియత్వాన్ని, సుకుమార భావతత్వాన్ని, సుందర అభివ్యక్తీకరణను తన సొంతం చేసుకొని, కవన సౌరభాలను ఈ కవితల్లో వ్యక్తీకరించారు. అందుకే ప్రకృతిలోని సంపదలైన పక్షులు, సెలయేళ్లు, తూనీగలు, లేళ్లు, ఉరుములు, మెరుపులు, ఇంద్ర ధనస్సులు, చందమామ చిరునవ్వులు కవిత్వంగా కనిపిస్తాయి. అలాగే శ్రీశ్రీ అభ్యుదయ కవిత్వ ఛాయలు కూడా గోచరమవుతాయి. మానవ సమాజం దాని పురోగ, తిరోగమనాలు, ఆర్థిక స్వావలంబన, పేదరికం, మానవత్వం, మంచితనం, సమాజంలోని అసమానతలు అనేక చోట్ల స్పర్శిస్తాయి. సామాజిక విలువలు తగ్గిపోతున్న ఈ ఆధునికకాలంలో నైతికంగా మనిషిని తిరిగి పునర్జీవితుణ్ని చేయడానికి కలాన్ని ఆయన ఆయుధంగా వాడుకున్నారు. అలాగే ఉగ్రవాదం ప్రపంచాన్ని ఎంతగా అతలాకుతలం చేస్తుందో, దాన్ని ఎలా సమూలంగా నిర్మూలించాల్లో తెలియజేశారు. 'కాయానికి గాయమైతే నయం చేసుకుంటాం/పంటకు పురుగుపడితే కీటక నాశిని చల్లుకుంటాం/ఇంటికి బూజు పడితే దులుపేసుకుంటాం/అందుకే ప్రపంచమా మేలుకో/ప్రగతి విపంచికను సవరించుకో/చీకటిని ప్రేమించే ఉగ్రవాద సంస్థలని/కూకటివేళ్లతో పెకిలించాలి/ప్రతి పౌరుడు ఒక సైనికుడై/ఉగ్రవాదాన్ని తరిమికొట్టాలి' అంటారు.

రాయలసీమవాసిగా రచయితకు తాను రాస్తున్న కవిత్వంపై సుస్పష్టమైన లక్ష్యం ఉంది. అందుకే ఆయన 'నేను అభ్యుదయ కవిని/విప్లవకవిని/కార్మికుల కష్టం నా కవిత్వం/సమాజ సంఘటనలు నా కవిత్వం/ అధర్మ, అక్రమాలను చీల్చి చెండాడేది నా కవిత్వం' అంటారు. తెలుగు భాషోపాధ్యాయునిగా తెలుగు భాషకు సేవలు అందిస్తూనే ఇటు సమాజంపట్ల ఒక పౌరునిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ తన రచనల ద్వారా మేల్కొలుపు పాటలు పాడుతున్నాడు. భవిష్యత్తులో డాక్టర్ సంజీవరాయుడు మరిన్ని సమాజ శ్రేయోదాయక రచనలు రాయాలని అభిలషిస్తున్నాను.



- డాక్టర్ తొగట సురేశ్ బాబు, ప్రధానోపాధ్యాయులు, సాహితీవేత్త, కర్నూలు జిల్లా

నృత్య సంగీతాల్లో తల్లీబిడ్డ

- ప్రతిభా పురస్కారాలు.. ప్రశంసల వెల్లువ
- ఇద్దరితో మొదలై 130 మందికి శిక్షణ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆ తల్లీ కూతుళ్లిద్దరూ సంగీత నాట్యాల్లో కీర్తి గడించారు. అనేక అవార్డులు అందుకున్నారు. తల్లి నాగమల్లేశ్వరి, కూతురు దేవిశ్రీ కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్య శిక్షకులుగా కూడా ప్రశంసలు అందుకుంటున్నారు. ఎప్పుడో సరదాగా నేర్చుకున్న కళ ఇప్పుడు వృత్తిగా మారింది. నాగమల్లేశ్వరి పదో తరగతి పూర్తవగానే వివాహం, ఆపై పిల్లలు. తరువాత ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. పిల్లల చదువు కోసం కోసం ప్రతిరోజు ఈ.తాండ్రపాడు పుట్టి మీద కర్నూలుకు వచ్చిపోయేవారు. పిల్లల కోసం సాయంత్రం అక్కడే ఉండేవారు. ఇది చూసిన ప్రైవేటు పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ అవకాశం ఇచ్చింది. అక్కడ విధులు అయ్యాక పిల్లల కోసం సాయంత్రం వరకు ఫ్రీగా ఉండకుండా సంగీతం నేర్చుకున్నారు. ఆ తరువాత సంగీత శిక్షకురాలుగా స్థిరపడ్డారు. తల్లిబాటలోనే కుమార్తె దేవీశ్రీ కూచిపూడి నృత్యం నేర్చుకొని, శిక్షకురాలుగా మారారు. వీరు నగరంలోని ఎన్ఆర్ పేటలో నివాసముంటున్నారు.





చిన్నారులకు సంగీతం నేర్పిస్తున్న నాగమల్లేశ్వరి

నాగమల్లేశ్వరి పుట్టినిల్లు కర్నూలు మండలం ఈ.తాండ్రపాడు, అత్తవారిది నందికొట్కూరు మండలం వడ్డేమాను గ్రామం. భర్త రామలింగం ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. సరదాగా కర్ణాటక సంగీతం నేర్చుకున్న నాగమల్లేశ్వరి కాలనీలో ఉండే పిల్లలకు సంగీతం నేర్పిస్తూ గుర్తింపు తెచ్చుకుని దాన్నే వృత్తిగా మలుచుకున్నారు. ఇదే స్ఫూర్తితో కూతురు దేవీశ్రీ ఫిజియోథెరపీ కోర్సు చేస్తూనే కూచిపూడి నాట్యంలో డిప్లమో పూర్తి చేశారు. తల్లీ కూతుళ్లు కలిసి శ్రీవెంకటేశ్వర సంగీత నృత్య నిలయాన్ని ప్రారంభించి శిక్షణ ఇస్తున్నారు. కర్నూలు నగరానికి చెరందిన పలువురు విదేశాల్లో స్థిరపడ్డారు. గతంలో వారి పిల్లలు ఇక్కడ శిక్షణ తీసుకున్నారు. సంగీతం, నృత్యంపై పట్టు తప్పకుండా అక్కడికి వెళ్లినా ఆన్‌లైన్‌లో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఐదేళ్లగా అస్ట్రేలియా, కెనడా, క్యాలిఫోర్నియా, అమెరికా, దుబాయ్, అబుదాబిలో ఉన్న భారత సంతతికి ఆన్‌లైన్‌లో సంగీతం తరగతులు నిర్వహిస్తున్నారు. దేశంలోని సూరత్, గుజరాత్, విజయవాడ, మహబూబ్‌నగర్, వరంగల్, హైదరాబాదు, నాయుడు పేటలో పలువురికి ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్నారు. విదేశాల్లో సుమారు 11 మంది ఉండగా, స్వదేశంలో 30 మందికి సంగీతం, నృత్యంలో తల్లికూతుళ్లు శిక్షణ ఇవ్వడం గమనార్హం. ఎన్ఆర్‌పేటలోని శిక్షణాలయంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కర్ణాటక సంగీతం, కూచిపూడి నాట్యంలో శిక్షణ ఇస్తున్నారు. బ్యాచ్‌ల వారిగా సుమారు వంద మంది పిల్లలు శిక్షణ పొందుతున్నారు. పగటి పూట కొందరు గృహిణులు సైతం సంగీతం నేర్చుకోవడానికి వస్తున్నారు. ఇందులో వీఐపీ కుటుంబాలకు చెందిన పలువురు మహిళలు, వైద్యులు ఉన్నారు.

ఇద్దరితో మొదలై...

ప్రారంభంలో ఇద్దరితో మొదలైన సంగీత, నృత్య శిక్షణ ప్రస్తుతం 130 మందికి చేరుకుంది. నాగమల్లేశ్వరి తన గురువు ధనలక్ష్మి ప్రేరణతో సంగీతం నేర్పిస్తున్నారు. మొదట్లో పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ల కుమార్తెలు వచ్చేవారు. నాగమల్లేశ్వరి శిక్షణ తీరును ప్రశంసించడంతో అక్కడి నుంచి వరద మాదిరి పిల్లలు సంగీతం నేర్చుకోవడానికి వచ్చేవారు. సంగీతంతో పాటు కూచిపూడి కూడ దేవీశ్రీ వద్ద నేర్చుకుంటున్నారు.

నాగమల్లేశ్వరి అందుకున్న పురస్కారాలు..

- 2022లో మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా గ్రంథాలయంలో మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ చేతుల మీదుగా సన్మానం.
- హైందవ శ్రేష్టి ఆధ్వర్యంలో ధార్మిక విద్యాసేవక్ టీజీ కళాక్షేత్రంలో నిర్వహించిన భగవద్గీత పారాయణానికి సంబంధించి జిల్లా నుంచి ఎంపిక.
- ఇదే సంవత్సరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని టీజీ కళాక్షేత్రంలో నాగశక్తి అవార్డును సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి చేతుల మీదుగా అందుకున్నారు.
- 155 మంది పిల్లలతో భగవద్గీత ఒకటో అధ్యాయాన్ని సామూహికంగా సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో పారాయణం చేయించినందుకు ఇస్కాన్ రఘునందన్ ప్రభు చేతుల మీదుగా వండర్ బుక్ ఆఫ్ అవార్డును 2024లో అందుకున్నారు.



చిన్నారులకు నృత్యం నేర్పిస్తూ..

దేవీశ్రీ ప్రదర్శనలు.. అందుకున్న పురస్కారాలు

- సెట్కూరు వారు నిర్వహించిన జిల్లా స్థాయిలో యూత్ ఫెస్టివల్ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో 2015, 2017 సంవత్సరాల్లో రెండుసార్లు జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. రెండుసార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు అందుకున్నారు. కర్నూలు నగరంలోని శారదా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో వేసవి శిబిరంలో ఉత్తమ ప్రదర్శన ఇచ్చి అప్పటి రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.
- జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల్లో పలు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.
- ఇండియా టుడే వారు వైజాగ్‌లో 2018లో నిర్వహించిన ఇండియా టుడే సౌత్ కాంక్లేవ్-2018లో ఇచ్చిన ఉత్తమ నృత్య ప్రదర్శనను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూసి అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు.
- 2017లో హర్యానాలో స్టేట్ జూబ్లీ సందర్భంగా కురుక్షేత్రంలో కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. దేవీశ్రీ ప్రతిభను మెచ్చుకున్న అప్పటి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేశారు.
- 2018లో హైదరాబాద్‌లోని తెలుగు వర్సిటీలో దక్షిణాది నృత్య ఉత్సవాల సందర్భంగా ప్రదర్శన ఇచ్చారు. ప్రతిభను గుర్తించిన ప్రతినిధులు నాట్య విద్యాధరణి పురస్కారాన్ని అందజేశారు.
- 2019 జనవరిలో ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన గణతంత్ర వేడుకల్లో ఇతర రాష్ట్రాల నృత్య కళాకారిణులతో కలిసి పాల్గొని ప్రదర్శన ఇచ్చారు.
- గ్రేటర్ నోయిడాలో ఏపీ టూరిజం తరఫున అనేక ప్రదర్శనలు ఇచ్చి అభినందనలు అందుకున్నారు.
- శ్రీశైలం, కాణిపాకం, కాళహస్తి, తిరుచానూర్, వేలూరు గోల్డెన్ టెంపుల్, జోగులాంబ అలంపూర్, అహోబిలం, మంత్రాలయం, నందవరం చౌడేశ్వరి ఆలయాల్లో నిర్వహించిన బ్రహ్మోత్సవాలు, వార్షికోత్సవాల్లో నృత్య ప్రదర్శనలు ఇచ్చి గుర్తింపు పొందారు.
- దసరా వినాయక చవితి నవరాత్రులు, నిమజ్జనోత్సవ కార్యక్రమాల్లో నృత్యం చేసి అతిథులచే అభినందనలు అందుకున్నారు.
- ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఉగాది, సంక్రాంతి సంబరాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరచి ప్రముఖులచే ప్రశంసలు అందుకుంటున్నారు.
- ఎస్వీ సుబ్బారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న జాతీయ సాంస్కృతిక సమ్మేళనంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ మెప్పిస్తున్నారు.

మరింత మందికి నేర్పించాలన్నదే నా కల..

సంగీతంలో మరింత మందికి శిక్షణ ఇవ్వడమే నా లక్ష్యం. సరదాగా, ఆసక్తిగా నేర్చుకున్న సంగీతమే నాకు వృత్తిగా మారింది. సంగీతం గురువులు జ్యోతిర్మయి, సరస్వతి, నారాయణస్వామి, శ్రీనివాస్‌ల ఆశీస్సులతో నేను సంగీత ఉపాధ్యాయినిగా రాణిస్తున్నాను.

- నాగమల్లేశ్వరి, కర్ణాటక సంగీత శిక్షకురాలు



తమిళనాడులోని గోల్డెన్ టెంపుల్‌లో తల్లి, కూతరు నాగమల్లేశ్వరి, దేవీశ్రీ

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఉంది

నేను ఆరో తరగతి చదువుతున్నప్పుడే కూచిపూడి శిక్షణ తీసుకున్నా. గురువులు నారాయణస్వామి, నాగసాయి ప్రదీప్ శిక్షణలో మెళకువలు నేర్చుకున్నాను. అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చి గుర్తింపు పొందాలన్నదే నా లక్ష్యం.

- దేవీశ్రీ, కూచిపూడి నృత్యకారిణి

ఎన్ఎంయూ జిల్లా కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

కోవెలకుంట్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిర ఫంక్షన్‌హాలులో సుదర్శన్‌రావు అధ్యక్షతన జిల్లా ద్వితీయ మహాసభ ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ నంద్యాల జిల్లా అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు పి.సత్యనారాయణ రావు, సి.మద్దిలేటి, రాష్ట్ర కార్యదర్శి భద్రావతి, జోనల్ అధ్యక్షులు వినోద్‌బాబు హాజరయ్యారు. ఎన్ఎంయూ జిల్లా అధ్యక్షుడిగా డి.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛైర్మన్‌గా సుదర్శన్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంటుగా వీపీరెడ్డి, జిల్లా కార్యదర్శిగా శివరాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు మాట్లాడుతూ ఆరు సంవత్సరాలుగా సిబ్బందికి ప్రమోషన్ ఇవ్వకపోవడం వల్ల చాలా మంది ఆర్థికంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాకంగా ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథంలో భాగంగా సిబ్బంది ఎంతో కష్టపడి పనిచేయడం వల్ల సంస్థకు మంచి పేరు వచ్చినప్పటికీ బస్సుల కొరత, సిబ్బంది కొరత వల్ల తీవ్ర ఇబ్బందులు పడ్డారని, వాటిని వెంటనే యాజమాన్యం పరిష్కరించాలని కోరారు.

చేపల అక్రమ వేటను అరికడతాం

- మత్స్య శాఖ జిల్లా అధికారి రంగనాథబాబు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పందికోన రిజర్వాయరులో చేపల అక్రమ వేటను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నామని మత్స్య శాఖ జిల్లా అధికారి రంగనాథబాబు అన్నారు. శనివారం మత్స్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్రమంగా చేపల వేట కొనసాగిస్తున్న వారిని తాము ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పందికోన రిజర్వాయరు పరిధిలో మత్స్యకారుల సహకార సంఘాలు లేవని, అందువల్ల ఏటా మత్స్యశాఖ బహిరంగ వేలం ద్వారా చేపల పెంపకానికి అనుమతులు ఇస్తుం దన్నారు. జూన్-2025తో చేపల వేటకు గడువు పూర్తయిందన్నారు. రాష్ట్రంలోని మైనర్ ఇరిగేషన్ చెరువులు, రిజర్వాయర్లలో చేపల వేటకు మత్స్య సహకార సంఘాలకు అనుమతులను ప్రభుత్వం ఇంకా ఇవ్వలేదని, అందువల్ల ఈ సంవత్సరం వేలం పాట ఇప్పటిదాకా నిర్వహించలేదని వివరించారు. రూ.50లక్షల వరకు అక్రమార్కులు చేపల వేట కొనసాగించి దోపిడీ చేశారని కొందరు ప్రచారం చేస్తున్నారని, ఇందులో వాస్తవం లేదన్నారు. ప్రభుత్వం జీవో జారీ చేసేవరకు చేపలు పట్టకుండా నివారిం చేందుకు అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. ఎవరైన అక్రమంగా చేపల వేట కొనసాగిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రకృతి మన జీవితానికి మూలం

- మొక్కలు నాటే బాధ్యతను తీసుకోవాలి
- కలెక్టర్ రాజకుమారి
- ఆకట్టుకున్న సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు

డోన్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి మన జీవితానికి మూలమని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం మండలంలోని ఎర్రగుంట్ల గ్రామ సమీపంలో ఉన్న నగరవనంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వన సమారాధానోత్సవాల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటే బాధ్యత ప్రతి కుటుం బం తీసుకోవాలన్నారు. నగరవనంలోని ఉసిరి చెట్టుకు కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సంకల్ప ప్రతిజ్ఞ చేశారు. ప్రజలందరూ భక్తి భావంతో కార్తికవన సమారాధనోత్సవాలను జరుపుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పర్యావరణ సంకల్పాలను ప్రతిబింబించే చిన్నారుల పాటలు, నృత్యాలు అలరించాయి. విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.



టగ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి



ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఉసిరి మొక్కలు పంపిణీ చేశారు. నగరవనంలో కార్తీక సమారాధ నోత్సవాలు డోన్ ఫారెస్ట్ రేంజర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్వో రామునాయక్, డోన్, ఆత్మకూరు ఆర్డీవోలు నరసింహులు, శివనా గజ్యోతి, డీఎఫ్‌వో నాగమునేశ్వరి, డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

డోన్ మండలం ఎర్రగుంట్ల గ్రామం వద్ద నగరవనంలో శనివారం జరిగిన కార్తీక వన సమారాధన ఉత్సవాల్లో అధికారులు, ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. జిల్లా అటవీశాఖ అధికారి నాగమనేశ్వరి, డోన్ ఫారెస్ట్ రేంజర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధనోత్సవాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు ఓ సినిమా పాటకు స్టెప్పులు వేసి అలరించారు. అలాగే టగ్ ఆఫ్ వార్‌లో కలెక్టర్ రాజకుమారి పాల్గొన్నారు. అధికారులు ఉత్సాహంగా, ఉల్లాసంగా నవర వన కార్తీక వన సమారాధోత్సవాల్లో కనిపించారు.

హోరాహోరీగా పొట్టేళ్ల పందెం

పెద్దకడబూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): భక్త కనకదాసు జయంతి సందర్భంగా శనివారం పెద్దకడబూరులో పొట్టేళ్ల పందెం నిర్వహించారు. 18 పొట్టేళ్ల పాల్గొన్నాయి. ఎర్ర రంగు పొట్టేళ్ల విభాగంలో ఏటిగడ్డ పులి మొదటి స్థానంలో నిలవగా టీడీపీ నాయకుడు విరుపాక్షి రూ.15 వేలు ఇచ్చారు. నల్లరంగు పొటేళ్ల విభాగంలో భీమకు చెందిన పొట్టేలు మొదటి స్థానంలో నిలవడంతో టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి ఇచ్చిన రూ.20 వేలు ఆయన సోదరుడు రామకృష్ణారెడ్డి అందజేశారు. ఎర్రరంగు పొటేళ్ల విభాగంలో ఓబన్నకు చెందిన పొట్టేలు రెండు స్థానంలో, నల్లరంగు పొటేళ్ల విభాగంలో బల్లా పొటేలు రెండో స్థానంలో నిలిచాయి. రెండో స్థానంలో నిలిచిన పొట్టేళ్లకు మల్లికార్జున, శివన్న రూ.10 వేలు చొప్పున ఇచ్చారు. ఈ బహుమతులను అతిథులు ప్రదానం చేశారు.



పెద్దకడబూరులో పోటీ పడుతున్న పొట్టేళ్లు

అందుబాటులో ఆధునిక వైద్యం

- ప్రముఖ యూరాలజిస్టు డాక్టర్ విక్రమసింహారెడ్డి
- నంద్యాలలో ప్రారంభమైన యూరాలజీ వైద్యుల సదస్సు
- ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన 300 మంది వైద్యులు



డాక్టర్ విక్రమసింహారెడ్డిని సన్మానిస్తున్న వైద్యులు

నంద్యాల హాస్పిటల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో ఆధునిక వైద్యం అందుబాటులో ఉందని ఉస్మానియా ఆస్పత్రి రిటైర్డు సూపరింటెండెంట్, ప్రముఖ యూరాలజిస్టు డాక్టర్ విక్రమసింహారెడ్డి చెప్పారు. ఉభయ తెలుగు రాష్ట్రాల రెండు రోజుల జెనిటో యూరినరీ సర్జన్స్ సొసైటీ రాష్ట్ర స్థాయి సదస్సును శనివారం డా.విక్రమసింహారెడ్డి ప్రారంభించారు. పట్టణంలోని సౌజన్య కన్వెన్షన్ సెంటర్‌లో నంద్యాల, కర్నూలు జిల్లాల యూరాలజీ సంఘాల సంయుక్తంగా ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల యూరాలజీ సం ఘం అధ్యక్షుడు డా.జగదీశ్వర్ అధ్యక్షతన కార్యదర్శి డా.శ్రీనివాస్, నిర్వాహక కమిటీ ఛైర్మన్ డా.సీతారామయ్య, నిర్వాహక కార్యదర్శి డా.భార్గవవర్ధన్‌రెడ్డి నిర్వహణలో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. డాక్టర్ విక్రమసింహా రెడ్డి మాట్లాడుతూ యూరాలజీ విభాగంలో గత దశాబ్ద కాలంలో అధునాతన వైద్య విధానాలు, పరికరాలు అందుబాటులోకి వచ్చాయని, ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం వచ్చిందని అన్నారు. దక్షిణ భారత యూరాలజీ సంఘం కార్యదర్శి డాక్టర్ చంద్రమోహన్ మాట్లాడుతూ యూరాలజీలో కూడా ఏఐ వినియోగంతో అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలు చేయడానికి ఆస్కారం ఏర్పడిందన్నారు. నగరాలకే పరిమితమైన యూరాలజీ వైద్యం నేడు చిన్న పట్టణాల్లో కూడా అందుబాటులోకి వచ్చిందన్నారు. డాక్టర్ భార్గవవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నంద్యాల వైద్యుల సహకారంతో ప్రప్రథమంగా సూపర్ స్పెషాలిటీ రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించడం గర్వకారణమని అన్నారు. నంద్యాలలో యూరాలజీ విభాగంలో మూత్రపిండాలు, మూత్రాశయ, మూత్రనాళ, జననేంద్రియ జబ్బులకు అత్యంత ఆధునిక వైద్య వసతులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ సదస్సుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 300 మంది యూరాలజీ వైద్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో వైద్యులు జైబాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, దాసరి రమేష్, రవికృష్ణ, ఫనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు వెళ్తూ.. అనంత లోకాలకు

• స్కూటీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. యువతి దుర్మరణం

నందికొట్కూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా విధులను నిర్వహిస్తున్న యువతి రోడ్డుప్రమాదంలో దుర్మరణం చెందింది. ఈఘటన నందికొట్కూరులో చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని హాజీ నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ అలీం కూతురు షేక్ ఆఫ్రీన్(26) బీ.ఈడీ పూర్తి చేసి పట్టణంలోని శ్లోకా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ట్రైనీ టీచర్‌గా విధుల్లో చేరింది. శనివారం ఉదయం విధులకు తన స్కూటీపై వెళ్తున్న సమయంలో పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఇం డియన్ పెట్రోల్ బంకువద్ద ఆమె పెట్రోల్ వేయించుకుంది. కేజీ రోడ్డు పైకి రావడంతో ఆత్మకూరు నుంచి కర్నూలుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. తీవ్ర గాయా లపాలైన ఆఫ్రీన్‌ను పోలీసులు, స్థానికులు నందికొట్కూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


ప్రమాదానికి గురైన స్కూటీ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

• ఇద్దరికి తీవ్ర గాయాలు

నందికొట్కూరు రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రెండు బైకులు, లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. మరో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని కొణిదేల గ్రామం వద్ద శనివారం చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. ఓబైకుపై చాకలి లింగన్న, అతని మనుమడు జశ్వంతులు నందికొటూరు నుంచి కొణిదేలకు వెళ్తున్నారు. మరో బైక్‌పై కొణిదేల నుంచి నందికొట్కూరు వైపుగా చెన్నయ్య అతని కుమారుడు శ్రీరాములు వెళ్తుండగా రెండు బైకులు ప్రమాదవశాత్తు ఢీకొనగాగొల్ల చెన్నయ్య(45) కిందపడ్డాడు. అదే సమయంలో కొణిదేల నుంచి నందికొట్కూరు వైపుగా మొక్కజొన్నల లోడుతో వెళ్తున్న లారీ అతడిపై ఎక్కింది. చెన్నయ్య అక్కడికక్కడే మరణించగా మృతదేహం మాంసపు ముద్దలా మారిపోయింది. తీవ్రంగా గాయపడిన వారిని నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నందికొట్కూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.


బోల్తాపడ్డ బైక్

ట్యాంకర్ డ్రైవర్ మృతి


పరిశ్రమలో ఉద్యోగులను విచారిస్తున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో ట్యాంకర్ డ్రైవర్ అదుపు తప్పి కిందపడి మృతిచెందాడు. ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. వివరాల మేరకు... ఉయ్యాలవాడ మండలం అల్లూరు గ్రామానికి చెందిన గురుప్రసాద్(30) రామ్‌కో సిమెంట్స్‌లో ఓ కాంట్రాక్టు కంపెనీ కింద ట్యాంకర్ డ్రైవర్ పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం సిమెంట్ ట్యాంకర్ లోడు చేసుకొని ట్యాంకర్‌పైకి ఎక్కి ట్యాంకర్‌కు కప్పు తగిలించే సమయంలో పట్టుతప్పి కిందపడి పోయాడు. తీవ్ర గాయాలైన అతడిని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. సీఐ రమేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం.. వ్యక్తి అరెస్టు


గంజాయితో పట్టుబడ్డ లక్ష్మన్న

వెల్దుర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో గంజాయి పట్టుబడటం కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంజాయి తీసుకెళుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలో గోవర్ధనగిరి గ్రామానికి చెందిన ఎరుకల లక్ష్మన్నను మదార్‌పురం గ్రామ బస్టాండ్ సమీపంలో గంజాయిని తీసుకొని వెళుతుండగా సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ నరేశ్ తన పోలీసు సిబ్బందితో దాడులు నిర్వహించారు. అతనిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడులలో అతని వద్ద నుంచి 900 గ్రాముల పచ్చి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. మండల వ్యవసాయ అధికారి అక్బర్‌బాషా పంచనామా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ మంజుల, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ రేడియాలజీ దినోత్సవం


నివాళి అర్పిస్తున్న సిబ్బంది

నంద్యాల హాస్పిటల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సర్వజన ప్రభుత్వ ఆస్ప త్రిలో శనివారం ప్రపంచ రేడియాలజీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రేడియాలజీ పితామహుడు విలియం కొన్రాడ్ రోంట్‌జెన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిం చారు. రేడియాలజీ విభాగం ప్రొఫెసర్, హెచ్‌వోడీ డా.హరినాథ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జీజీహెచ్ ఆర్ఎంవో డా.వెంకటేష్, న్యూరాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ శ్యాంసుందర్, సైక్రియాటిస్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రవూఫ్, రేడియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.శ్రావణ్‌కుమార్, ఆర్థోపెడిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఓబయ్య, సైక్రియాట్రిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.విక్రముల్లా, ఆర్థోపెడిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.మారుతి, రేడియో గ్రాఫర్లు డేవిడ్‌సుందరం, సత్యం, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతకు కడుపార భోజనం

• 2016 నుంచి 'రూ.15కే భోజనం' అమలు
• ఇస్కాన్ సహకారంతో నిర్వహిస్తున్న మార్కెట్ కమిటీ



రైతన్న తమ పంట దిగబుడులను అమ్ముకునేందుకు ఎంతో వ్యయప్రయాసలతో మార్కెట్ యార్డులకు వస్తారు. ఇక్కడ గంటల, రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు. అలాంటప్పుడు చేతిలో డబ్బులు లేక.. ఆకలితో అలమటించేవాడు. ఈ కష్టాన్ని గుర్తించిన కర్నూలు మార్కెట్ కమిటీ ఇస్కాన్ ధార్మిక సంస్థతో కలిసి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రూ.15కే భోజనం అందించేందుకు 2016లో అప్పటి డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి ప్రారంభించారు. తొమ్మిదేళ్లుగా కష్టనష్టాలు ఎదురైనా రైతులకు నిత్యం భోజనం అందించేందుకు కృషి చేస్తోంది. ఇటీవలే ఉల్లి పంట దిగుబడులు తెచ్చినప్పుడు రైతులకు రెండు పూటలా (మధ్యాహ్నం, రాత్రి) కడుపార భోజనం అందించింది. ఈ పథకంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


రైతులకు భోజనం వడ్డిస్తున్న సెక్రెటరీ, సిబ్బంది(ఫైల్)

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 8ఆంధ్రజ్యోతి): అన్నదాతల ఆకలిని తీర్చి వారికి కడుపార భోజనం అందిస్తోంది మార్కెట్ కమిటీ. రూ.15కే భోజన పథకం ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగుతోంది. ఇస్కాన్ సంస్థ సహకారంతో అధికారులు, పాలకవర్గం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. రైతులు కేవలం రూ.15లు, మార్కెట్ కమిటి రూ.20లు, మిగిలిన మొత్తాన్ని ఇస్కాన్ ధార్మిక సంస్థ భరించేలా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. 2016లో తెలుగుదేశం ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే మొదటిసారిగా ఈ పథకాన్ని డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి కర్నూలు మార్కెట్ యార్డులో ప్రారంభించారు. ఏటా లక్ష మంది రైతులు ఈ భోజన పథకం వల్ల ప్రయోజనం పొందుతున్నారు. అదే విధంగా ప్రతి సంవత్సరం రూ.12లక్షల దాకా ఈ పథకానికి ఖర్చు చేస్తున్నట్లు కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ జయలక్ష్మి తెలిపారు.

అర్ధాకలితో ఇంటి ముఖం..

చేతికందిన పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ యార్డులో కనీసం పంట సాగుకు తెచ్చిన పెట్టుబడులను కూడా వ్యాపారుల నుంచి దక్కని సమయాల్లో అర్ధాకలితోనే ఇంటి ముఖం పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కొంతలో కొంతైనా రైతులను ఆదుకోవాలని, వారి ఆకలి తీర్చాలని అప్పటి మార్కెట్ కమిటీ చైర్మన్ శమంతకమణి ఇస్కాన్ ధార్మిక సంస్థ ప్రతినిధులను ఒప్పించి తక్కువ ధరకే భోజనం అందించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎటువంటి ఆటంకాలు లేకుండా కొనసాగించడంలో కర్నూలు మార్కెట్ కమిటీ అధికారులు, పాలకవర్గం అంకిత భావంతో పని చేస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులంతా పంట ఉత్పత్తులను అమ్ముకుని యార్డులోనే కేవలం రూ.15కే కడుపార భోజనం చేస్తున్నారు.

రోజూ 500 మంది రైతులు

రైతుల కోసం తక్కువ ధరకే అమలు చేస్తున్న భోజన పథకానికి విశేష స్పందన కనిపిస్తుంది. రోజూ 500ల నుంచి 600 మంది రైతులు రుచికరమైన భోజనం చేస్తున్నారు. ఈ పథకానికి ఏటా రూ.12 లక్షల దాకా ఖర్చు చేస్తున్నామని, ఈ ఖర్చు పెరిగినా ఇబ్బంది లేదని అధికారులు చెబుతున్నారు. జిల్లా అంతటా ఈ భోజన పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం ఇస్కాన్ ప్రతినిధులు కర్నూలు మార్కెట్ యార్డులోనే భోజనం తయారు చేసి వాహనంలో ఆదోని మార్కెట్ యార్డు కూడా తీసుకెళ్లి అక్కడి రైతులకు భోజనం అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 15 మార్కెట్ కమిటీలలో కేవలం కర్నూలు, ఆదోని మార్కెట్ కమిటీలలోనే ఈ భోజన పథకం అమలు చేస్తున్నారు.



నిరంతరం అమలు చేస్తున్నాం

2016లో కర్నూలు మార్కెట్‌యార్డులో రూ.15కే భోజనం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఆటంకాలు లేకుండా నిరంతరం అమలు చేస్తున్నాం. ఇటీవల ఉల్లి రైతులకు రాత్రి పూట కూడా భోజనం అందించాం. **- జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ, మార్కెట్‌యార్డు, కర్నూలు**

కొనలేం.. తినలేం..!

• మండుతున్న కూరగాయల ధరలు
• వంకాయ కిలో రూ.46పైనే
• క్యారెట్ రూ.50, బీన్స్ రూ.70
• క్యాప్సికం రూ.70
• ఇబ్బందులు పడుతున్న ప్రజలు


రైతుబజారులో కూరగాయలు కొంటున్న వినియోగదారులు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో పేద, మధ్య తరగతి ప్రజలు ఏమీ కొనలేని.. తినలేని పరిస్థితులు నెలకొన్నాయి. కూరగాయల ధరలు మండిపోతున్నాయి. పేదవర్గాలు పచ్చడి మెతుకులతోనే సరిపుచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి రోజూ వర్షం కురుస్తూనే ఉంది. కూరగాయల ధరలు మాత్రం దిగి రావడం లేదు. శనివారం సి.క్యాంపు రైతు బజారులో వంకా య రూ46, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.36, క్యారెట్ రూ.50, బీన్స్ రూ.70, చోళకాయలు రూ.60, బీట్‌రూట్ రూ.50, అల్లం రూ.94, క్యాప్సికం రూ.70, లావుమిర్చి రూ.60, ముల్లంగి బుడ్డలు రూ.60 ధర పలికింది. ఈ ధరలు చూసి కూరగాయలు కొనుగోలు కోసం రైతుబజారుకు వెళ్తున్న ప్రజలు గుండెలు బాదుకుంటున్నారు. సి.క్యాంపు రైతుబజార్, అమీన్ అబ్బాస్‌నగర్, కొత్తపేట రైతుబజారులో తప్పుడు తూకాలు, బోర్డుపై రాసిన ధరల కంటే రూ.5 ఎక్కువగా వసూలు చేస్తుండటంతో ఇదేమీ అన్యాయం అంటూ వినియోగదారులు లబోదిబోమంటున్నారు. ఎవ రైనా రైతుబజారు కార్యాలయానికి వెళ్లి సిబ్బందికి ఫిర్యాదు చేస్తే వారు వ్యాపారులను మందలిస్తున్నారు. ఎవరూ ఫిర్యాదు చేయకుంటే ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

కూరగాయల వినియోగం పెరిగింది



కార్తీక మాసంలో కూరగాయల వినియోగం పెరిగింది. అధిక వర్షాలతో కూరగాయలు, ఆకుకూరల దిగుబడులు తగ్గిపోయాయి. దీంతో ధరలు పెరిగాయి. ఎక్కడైనా స్టాల్స్ వద్ద కూరగాయల ధరలు బోర్డుపైన రాసిన దానికంటే ఎక్కువ ధర వసూలు చేస్తుంటే వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చు.

- కళ్యాణమ్మ, ఎస్టేట్ అధికారి, సి.క్యాంపు రైతుబజారు

పాఠశాల ఇలా.. చదువు ఎలా?

• శిథిలావస్థలో తిప్పాయిపల్లె పాఠశాల
• పంచాయతీ ఆఫీసులో తరగతులు


తిప్పాయపల్లెలో శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల


పంచాయతీ కార్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

ఓర్వకల్లు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పాయపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరింది. ఇక్కడ తమ పిల్లలు ఉంటే ప్రమాదమని తల్లిదండ్రులు అభ్యంతరం తెలపడంతో విద్యార్థులకు పంచాయతీ కార్యాలయంలో చదువు చెబుతున్నారు. తిప్పాయపల్లె గ్రామంలో 1961లో పాఠశాలను ప్రారంభించారు. 64 సంవత్సరాలు గడిచినా నూతన భవనాలను నిర్మించలేదు. పాఠశాలలో 23 మంది విద్యార్థులు ఉండగా.. ఇద్దరు ఉపాధ్యా యులు చదువులు చెబుతున్నారు. గదులు శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతున్నాయి. పాఠశాల దుస్థితిని గమనించిన గ్రామస్థులు పంచాయతీ కార్యాలయంలో తగరతులు నిర్వహించుకునే ఏర్పాటు చేశారు.

అలాగే పాఠశాల సమీంలోనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రం కూడా శిథిలావస్థకు చేరింది. 22 సంవత్సరాల నిర్మించినది కావడంతో పెచ్చులు ఊడుతున్నాయి. టీచర్లు, చిన్నారులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వీటిలో సోమయాజులపల్లె మజరా గ్రామం చెన్నంచెట్టిపల్లె, చింతలపల్లె గ్రామాని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి నూతన భవనాలు నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నివేదికలు పంపాం



తిప్పాయపల్లె, చెన్నంచెట్టి పల్లె, చింతలపల్లె గ్రామాల్లో పాఠశాలలు అధ్వాన్నంగా ఉన్నాయని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సహ కారంతో ప్రభుత్వానికి నివేదకలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే నూతన తరగతి గదులు నిర్మిస్తాం. **- ఓంకార్ యాదవ్, ఎంఈవో ఓర్వకల్లు**

ప్రజా ఉద్యమానికి తరలిరావాలి

• వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 12న జరిగే ప్రజా ఉద్యమానికి తరలిరావాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ భవనంలో పోస్టరు ఆవిష్కరించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో పేద యువతకు వైదవిద్య దూరమవుతుందన్నారు. పరిశీలకుడు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


పోస్టరును విడుదల చేస్తున్న ఎస్వీ మోహన్ రెడ్డి

• వైసీపీ జిల్లా కార్యాలయంలో భక్త కనకదాసు 538 జయంతిని పురస్కరించుకొని నివాళులర్పించారు ఇన్‌చార్జి ఎస్వీ మోహన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయమనోహరి, కార్పొరేటర్ సత్యనారాయణమ్మ పాల్గొన్నారు.

'అనాథల హక్కులను కాపాడాలి'

కర్నూలు కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనాథలకు న్యాయహక్కులు కాపాడడం మన బాధ్యత అని పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్, విశ్రాంత జిల్లా న్యాయాధికారి వెంకట హరినాథ్ అన్నారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, లీలా వెంకట శేషాద్రి సూచనల మేరకు, వెంకట హరినాథ్, లీగల్ సర్వీసెస్ యూనిట్ సభ్యులు, లీగల్ వలంటీర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, విశ్రాంత డీఎస్పీ పాపారావుతో కలిసి కంపాషన్ సొసైటీ హోమ్ ఆఫ్ హోప్‌ను తనిఖీ చేశారు. అక్కడ సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారు. అనాథలకు ఎవరికైనా న్యాయ సహాయం అవసరం అయితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ టోల్ ఫ్రీ నెంబరు 15100ను సంప్రదించాలని సూచించారు.

హైకోర్టు ఏజీపీగా మాలపల్లి వాసి


మఠం శివస్వామి

మంత్రాలయం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలపల్లి గ్రామానికి చెందిన మఠం శివస్వామి అమరావతి హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులయ్యారు. శుక్రవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మాలపల్లికి చెందిన మల్లికార్జున స్వామి, మల్లేశ్వరమ్మల కొడుకు శివస్వామి. స్థానిక పాఠశాలలో 5వ తరగతి వరకు, మండలంలోని విద్యనగర్ ఎస్ఎంకేవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వరకు చదివారు. శనివారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు సీతారామిరెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, వైసీపీ మండల అధ్యక్షుడు గుర్రెడ్డి భీమిరెడ్డి అభినందనలు తెలిపారు.

రుణాలను మంజూరు చేయాలి


కేడీసీసీబీ చైర్మన్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న సొసైటీ చైర్మన్

ఆత్మకూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ ద్వారా రుణాలను మంజూరు చేయాలని సొసైటీ చైర్మన్ షహబుద్దిన్ కోరారు. శనివారం కర్నూలులోని కేడీసీసీబీ కార్యాలయంలో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి సన్మానించారు. తమ సొసైటీకి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు ప్రాంతంలో చిన్న వ్యాపారులు రుణాలు కావాలని తమ కార్యాలయాన్ని సంప్రదిస్తున్నట్లు చెప్పారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రూ.కోటి నిధులను మంజూరు చేయాలని కోరారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు


మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంఈవో, ఎస్ఎంసీ చైర్మన్

ఆత్మకూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో అయ్యూబ్ అహ్మద్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్ ఎస్ఎండీ గౌస్‌తో కలిసి 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎంతగానో తోడ్పాటునందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మోహన్‌బాబు, ఉపాధ్యాయులు మోమిన్‌వలి, ఉస్మాన్‌బాషా, ఇస్మాయిల్, నాయకులు కొయ్యమున్న, మహెబూబ్ ఉన్నారు.

పెట్టుబడిదారులకు బీజేపీ ఊడిగం


మాట్లాడుతున్న గౌస్

పాణ్యం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారులకు బీజేపీ ఊడిగం చేస్తోందని సీఐటీయూ జిల్లా నాయకులు గౌస్ విమర్శించారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ షాదీఖానాలో సీఐటీయూ మండల మహాసభ నిర్వహించారు. గౌస్ మాట్లాడుతూ కార్మిక రాజ్యస్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తల ఆడిస్తున్నారన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామన్న ఎన్నికల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు భాస్కర్, నాగరాజు, వెంకటమ్మ, సువార్తమ్మ, సుబ్బరత్నమ్మ, బషీరు, ఆశ వర్కర్లు, వీఓఏలు, హమాలీ వర్కర్లు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి


కరపత్రాలను పంపిణీ చేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

ఆత్మకూరురూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షుడు సామన్న డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని నల్లకాలువ, బాపనంతాపురం, నల్లకాలువ గ్రామాల్లో కౌలు రైతు సంఘం నాయకులతో కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతులు పండించిన పంటను కొనుగోలు చేయకుండా మోసగిస్తోందన్నారు. వర్షానికి దెబ్బతిన్న పంటలకు బీమా వర్తింపజేసి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే రైతులకు మద్దతు ధర ప్రకటించి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జయన్న, పేరయ్య, నాగలింగం, దానమయ్య తదితరులు పాల్గొన్నారు.

సప్తనది తీరంలో కార్తీక సందడి


ఉమామహేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సప్తనదుల సంగమేశ్వరంలోని సప్తనది తీరంలో కార్తీక సందడి నెలకొంది. కార్తీక మాసం పురస్కరించుకుని శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి సప్తనదుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. ఎగువ ప్రాంతంలోని ఉమామహేశ్వరస్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ శివునికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పుష్పార్చన, మహానైవేద్యం తదితర విశేష పూజలు చేశారు. అలాగే మహిళలు సప్తనది తీరంలో కార్తీక దీపాలు వెలిగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. విచ్చేసిన భక్తులకు కాశిరెడ్డినాయన ఆశ్రమ కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు.

11న మైనార్టీ సంక్షేమ దినోత్సవం

- ఆ శాఖ జిల్లా అధికారి సబీహాపర్వీన్
- మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు ఆహ్వానపత్రిక అందజేత


మంత్రి ఫరూక్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సబీహాపర్వీన్

నంద్యాల రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యాదినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సబీహాపర్వీన్ తెలిపారు. శనివారం టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాపరిధిలోని మైనార్టీలు, విద్యావేత్తలు, ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అస్మద్దీన్, ఇలియాజ్, రఫీ పాల్గొన్నారు.

హెల్త్ కార్డులు మంజూరు చేయాలి

ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి హెల్త్ కార్డులు మంజూరు చేయాలని నోబుల్ టీచర్స్ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. శనివారం టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను అసోసియేషన్ ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఉద్యోగులు అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఇబ్బందులు ఎదుర్కొనాల్సిన వస్తుందని, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మహ్మద్‌రఫీ, మహబూబ్‌బాషా, నందిరెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

తత్వవేత్త, సంఘ సంస్కర్త భక్త కనకదాసు


భక్తకనకదాసు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జగ్గయ్య తదితరులు

నంద్యాల నూనెపల్లి, నవంబరు 8 : భక్త కనకదాసు ప్రఖ్యాతకవి, వాగ్గేయకారుడు, సంఘసంస్కర్తని బీసీ వెనుకబడిన తరగతుల జిల్లా సంక్షేమాధికారి జగ్గయ్య అన్నారు. శనివారం పట్టణంలోని బీసీ వెనుకబడిన తరగతుల జిల్లా సంక్షేమశాఖ కార్యాలయంలో భక్త కనకదాసు జయంతిని నిర్వహించారు. ముందుగా భక్తకనకదాసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనకదాసు కులవివక్షతకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. ద్వైత వేదాంత ఆధారంగా వినయం, కరుణ, సమానత్వాన్ని ప్రచారం చేశారన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల గొర్రెల సహకార సంఘం డైరెక్టర్ యుగంధర్, పట్టణ కురువ సంఘం అధ్యక్షుడు కిరణ్, గౌరవ అధ్యక్షులు శ్రీరాములు, శంకర్, ప్రభుత్వ బీసీ వసతిగృహాల వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాఉద్యమాన్ని జయప్రదం చేయాలి

- శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా

ఆత్మకూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ.. ఈ నెల 12న ఆత్మకూరు పట్టణంలో చేపట్టనున్న ప్రజాఉద్యమాన్ని జయప్రదం చేయాలని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కోరారు. శనివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీప్రభుత్వ హయాంలో 17కొత్త మెడికల్ కళాశాలలను మంజూరు చేసి వైద్యవిద్యకు అధిక ప్రాధాన్యం కల్పించినట్లు తెలిపారు. ఏడాదిలోనే ఐదు కళాశాలలో తరగతులను ప్రారంభించామన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షలా మారే ప్రమాదం ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 12న స్థానిక నంద్యాల టర్నింగ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టామన్నారు. వైసీపీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్, అంజాద్‌అలి, మునీర్‌బాషా తదితరులున్నారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు నాసర్


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకుడు

నంద్యాల రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు నాసర్ డిమాండ్ చేశారు. ఇచ్చాపురం నుంచి హిందూపురం వరకు చేపట్టిన బస్సు యాత్ర శనివారం నంద్యాలకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక వివేకానంద ఆడిటోరియంలో సభ నిర్వహించారు. నాసర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ. 6400 కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నాడు వైసీపీ ప్రభుత్వ చేసిన తప్పులను ఎత్తి చూపుతూ అవే తప్పులను ప్రస్తుత ప్రభుత్వం చేయడం సరికాదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ , కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. జిల్లాలో అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 12న అనంతపురంలో ముగింపు సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి సమరశీల పోరాటాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సూర్యప్రతాప్, సాయిరాంరెడ్డి, రాంబాబు, ప్రవీణ్, మాధవ్, శశిరెడ్డి పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ వరప్రసాద్


గిరిజనులతో మాట్లాడుతున్న నరహరి వరప్రసాద్

శ్రీశైలం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు హర్షణీయమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ కొండారెడ్డి నరహరి వరప్రసాద్ అన్నారు. శనివారం శ్రీశైలం పరిధిలోగల గిరిజన ప్రాంతాలలో ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన యువత విద్యాభ్యాసానికి, ఉపాధి కల్పనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నూతన పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. 2014-19లో శ్రీశైలం దేవస్థానం నుంచి గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయింపజేసిన ఘనత చంద్రబాబునాయుడుదేనని గుర్తు చేశారు. ఐటీడీఏ అధికారులతో చర్చించి పలు ప్రాంతాల్లో తక్కువ అద్దెలు చెల్లించి వ్యాపారాలు నిర్వహించుకునేందుకు తగు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వల్ల గిరిజన సంక్షేమం, అభివృద్ధి పదేళ్ల వెనుకకు వెళ్లిందని ఆరోపించారు. జగన్ నిర్ణయాలు గిరిజనుల పాలిట శాపంగా మారిందన్నారు. గిరిజన ప్రాంతంలో పర్యటించిన వారిలో జీపుల నాయక్, కొండలు, శ్రీను నాయక్, బయన్న మారెమ్మ తదితరులున్నారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత: ఎఫ్ఆర్వో


నారాయణపురంలో దండోరా వేయిస్తున్న అధికారులు

బండిఆత్మకూరు నవంబరు8(ఆంధ్రజ్యోతి): అడవి, అందులోని సంపదను రక్షించుకోవటం అందరి బాధ్యత అని ఎఫ్ఆర్వో నజీర్‌ఝా సూచించారు. శనివారం మండలంలోని నారాయణపురం, చిన్నదేవళాపురం, బరకలకాలనీ, నారపురెడ్డికుంట గూడెం గ్రామంలో దండోరా ద్వారా అటవీ అధికారులు సూచనలు, హెచ్చరికలు తెలియజేశారు. ఎఫ్ ఎస్‌వో కాశీంనాయక్ మాట్లాడుతూ అడవిలోకి ప్రవేశించ టం నిషిద్ధమన్నారు. అగ్గిరాజేసే ఎలాంటి వస్తువులు తీసుకెళ్లరాదన్నారు. జాతీయ వన్యప్రాణి అభయారణ్యంలోని ఏ జంతువు ప్రాణానికి హాని కల్గించరాదన్నారు. వలలు వేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించా రు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో రాజేష్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

అధ్వానంగా ఓంకారం రోడ్డు

- రాకపోకలకు ఇబ్బందులు
- రోడ్డు వేయించాలని భక్తుల విజ్ఞప్తి


గుంతలు పడిన రోడ్డు

బండిఆత్మకూరు, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): నల్లమలలో వెలసిన శైవక్షేత్రాల్లో ఓంకార క్షేత్రం ఒకటి. ఈ క్షేత్రానికి వెళ్లే బీటీ రోడ్డు గుంతల మయంగా మారింది. దాంతో అటు భక్తులు, ఇటు వాహనదారులు తీవ్ర అవస్థ పడుతున్నారు. 2018లో బండిఆత్మకూరు నుంచి ఓంకార క్షేత్రానికి డబుల్ రోడ్డు వేసేందుకు టీడీపీ ప్రభుత్వం రూ.18.30 కోట్ల నిధుల మంజూరు చేసింది. అప్పటి కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టిన అనంతరం 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటి ఎమ్మెల్యే కాంట్రాక్టర్‌ను తప్పించి తన అనుచరులకు పనులు తిరిగి అప్పగించి మళ్లీ ఓంకారం రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. అయితే ఐదు సంవత్సరాల్లో చేసిన పనులకు కాంట్రాక్టర్‌కు నిధులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిపివేశారు. ఉన్న రోడ్డును తవ్వివేయడంతో ఎక్కడ చూసినా గుంతలుగానే నిలిచిపోయింది. ఈ ఏడాది శివరాత్రి ఉత్సవాల సమయంలో తాత్కాలిక రోడ్డు వేసేందుకు కలెక్టర్ రూ. మూడు లక్షల నిధులు మంజూరు చేయగా గుంతలకు ప్యాచీలు వేయించారు. పనుల్లో నాణ్యత లేకపోవడంతో రోడ్డు మళ్లీ దెబ్బతిన్నది. దాంతో ఓంకారం వెళ్లే భక్తులు, శిగవరం, ఏరుకలకాలనీ, సోమయాజులపల్లె, నాయినిచెర్వు గ్రామాల ప్రజలు రాకపోకలకు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి ఓంకారం క్షేత్రానికి రోడ్డు నిర్మాణం పూర్తి చేయించాలని పలువురు కోరుతున్నారు.

నేడు కార్తీక వనభోజన మహోత్సవం

ఆత్మకూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్తీక వనభోజన మహోత్సవాన్ని జయప్రదం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ శ్రీశైలం నియోజకవర్గం నాయకులు మన్నెం బాలస్వామియాదవ్, గాంతి రమణయాదవ్, ఉపేంద్రయాదవ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఆదివారం యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కర్నూలులోని జగన్నాథగట్టు వద్ద గల రూపాల సంగమేశ్వర స్వామి సన్నిధిలో కార్తీక వన భోజన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.యాదవులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే, మాండ్ర దంపతులు


శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే, మాండ్ర దంపతులు

నందికొట్కూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో వేంకటేశ్వరస్వామివారిని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి దంపతులు శనివారం దర్శించుకున్నారు. పవిత్రమైన కార్తీక మాసం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అబ్దుల్ రఫీ

బండిఆత్మకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలకు స్థానిక మోడల్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ రషి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 7న పార్నపల్లెలో నిర్వహించిన జిల్లాస్థాయి ఒకేషనల్ ట్రేడ్ బ్యూటీ, వెల్‌నెస్ విభాగంలో విద్యార్థినులు వాసంతి, వందన, షాజీద, రేణుకశ్రీ ప్రతిభ చూపారని హర్షం వ్యక్తం చేశారు. ఒకేషనల్ ట్రైనీఉపాధ్యాయురాలు భావ్యను, విద్యార్థినులను జ్ఞాపికను అందజేసి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలని ఆకాంక్షించారు.

గిరిజన విద్యార్థి ప్రతిభ


విద్యార్థికి జ్ఞాపికను అందిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు మండలంలోని శివపురం గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థి ఐలేని భరత్ తేజ (9వ తరగతి) ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరన్న శనివారం తెలిపారు. హెచ్ఎం మాట్లాడుతూ ఈ నెల 6న కర్నూలు ఎస్టీబీసీ కళాశాల క్రీడామైదానంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-14 వాలీబాల్ పోటీల్లో భరత్ తేజ ప్రతిభ కనబరిచారన్నారు. త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో తమ విద్యార్థి పాల్గొంటున్నారన్నారు. ఈ సందర్భంగా భరత్ తేజకు ఉపాధ్యాయులు జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు సుంకన్న, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఎంపిక


ప్రతిభ చూపిన విద్యార్థులు

నంద్యాల రూరల్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నూనెపల్లె మున్సిపల్ పాఠశాలలో ఈనెల 7న జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ సాధించారని అయ్యలూరు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అలివేలమ్మ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శనివారం హెచ్ఎం అభినందించారు. ఆమె మాట్లాడుతూ.. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ అండర్-14 విభాగంలో కిరణ్‌కుమార్, వాలీబాల్ అండర్- 17 విభాగంలో నిఖిల్‌కుమార్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో జరగబోయే పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇందుకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయుడిని ప్రత్యేకంగా అభినందించారు.

రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

శ్రీశైలం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు యత్నించిన ఇద్దరు వ్యక్తులను శ్రీశైలం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. శనివారం ఉదయం పల్నాడు జిల్లా వినుకొండ నడిగడ్డ గ్రామానికి చెందిన ఒంటేరు గురువయ్య, దుర్గా వీరాంజనేయులు సుమారు ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించారన్నారు. ఆ బ్యాగులను ఆర్టీసీ బస్టాండ్ పార్కింగ్ స్థలం వద్ద ఉంచి తరలించేందుకు యత్నిస్తుండగా సమాచారం రావడంతో పోలీసులు వెళ్లి వారిని అదుపులోకి తీసకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీఐతో పాటు పోలీసులు రఘునాథుడు, రంగన్న, నానునాయక్, అమర్‌నాథరెడ్డి ఉన్నారు.

గుంతలో పడుతున్నా.. స్పందించరా?


కల్వర్టుపై పడిన గుంత

జూపాడుబంగ్లా, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని నీలిపల్లెపేట మలుపువద్ద కల్వర్టు శిథిలమైంది. దాంతో రాకపోకలకు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట గుంతలో పడుతూ లేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడంలేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి కల్వర్టుపైకప్పు వేయించాలని స్థానికులు కోరుతున్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో శంకరప్రసాద్

చాగలమర్రి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివే పది విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలి నంద్యాల డిప్యూటీ డీఈవో శంకరప్రసాద్ అన్నారు. శనివారం చాగలమర్రి బాలికోన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యా యినులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమ్మెటివ్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. హెచ్ఎం శివలక్ష్మీ, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

బనగానపల్లె, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈవో శ్రీనివాసులు, ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు నూతన ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏపీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా డీఎస్సీలో ఎంపికైన వారిని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఓబుళరెడ్డి అధ్యక్షతన వారు సత్కరించారు. కార్యక్రమంలో సీ.సుదర్శన్, డి.నరేశ్ బాబు, చంద్రశేఖర్, ఖాదర్ బాషా, మధు, భాస్కర్ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

బేతంచెర్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామి ఆలయాభివృద్ధికి భక్తులు రూ.1.01 లక్షలను విరాళం అందజేసినట్లు ఆలయ ఉప కమిషనర్ రామాంజనేయులు శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ డోన్ పట్టణానికి చెందిన కాయపాటి ప్రతాప్ యాదవ్ మనుమళ్ల పేర్లపై సూర్యాన్స్, అనిరుద్ రూ.1,01,016లు విరాళం అందజేసినట్లు తెలిపారు.

అధికారుల విచారణ

చాగలమర్రి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని అదృశ్యంపై శనివారం జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ ప్రేమంతకుమార్, జీసీడీవో సువర్చల, డిప్యూటీ డీఈవో శంకరప్రసాద్, ఆర్జేడీ శామ్యూల్ విచారణ చేశారు. పాఠశాలలో ఎస్వో స్వప్న, ఉపాధ్యాయినులు, సిబ్బందిని విచారించారు. విద్యార్థిని శుక్రవారం ఉదయం పాఠశాల నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం రావడంతో ఈ విచారణ చేపట్టామని వారు పేర్కొన్నారు. విద్యార్థిని అదృశ్యంపై పాఠశాలలోని ముగ్గురికి షోకాజ్ నోటీసు జారీ చేస్తున్నామని ఏపీడీ తెలిపారు. విద్యార్థిని ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

తల్లిదండ్రులు చెంతకు విద్యార్థిని

చాగలమర్రి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ పాఠశాలలో విద్యార్థిని అదృశ్యమైన సంఘటన శనివారం వీడింది. శుక్రవారం ఉదయం పాఠశాల నుంచి వెళ్లిపోయింది. చివరకు పాఠశాల మేడపైనే ట్యాంకు వద్ద తలదాచుకుంది. 24 గంటల పాటు అధికారులు, పోలీసులు విద్యార్థిని కోసం గాలించారు. చివరకు ఓ మహిళ కళాశాల మేడపైన నీటి ట్యాంకు వద్ద ఉన్నట్లు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ సురేష్, పోలీసులు, అధికారులు పాఠశాల వద్దకు చేరుకొని విద్యార్థినిని విచారించారు. అనంతరం విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగించారు.

టీడీపీ నాయకుడి మృతి తీరని లోటు



నివాళి అర్పిస్తున్న భూమా జగత్ విఖ్యాతరెడ్డి

చాగలమర్రి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఎం.పెద్దహసన్ (65) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి గ్రామానికి వెళ్లి మృత దేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ పుల్లయ్య, నాయకులు బ్రహ్మానందరెడ్డి, లక్ష్మీరెడ్డి, రమణారెడ్డి, శివారెడ్డి, భూషణం ఉన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బనగానపల్లె, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించే సైన్సు ప్రదర్శనా పోటీలకు ఎంపికైనట్లు హెచ్ ఎం భాస్కర్‌రెడ్డి శనివారం తెలిపారు. యాగంటిపల్లె ఉన్నత పాఠశాలలో చదువుతున్న రామచంద్రుడు, మహేశ్వరరెడ్డిలు అనే విద్యార్థులు వ్యర్థ పదార్థాలతో విద్యుత్ ఎలా తయారు చేయాలి అన్న అంశంపై బెంగళూరులోని అగస్త్య ఫౌండేషన్ తరఫున నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయిలో గెలుపొంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు మురళి, రాంకోటి, రాంపుల్లారెడ్డి అభినందించారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

డోర్నిపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డోర్నిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి ఒకేషనల్ ఎగ్జిబిషన్ కాంపిటేషన్‌లో బండిఆత్మకూరులో నిర్వహించిన పోటీల్లో సత్తాచాటి విజేతగా నిలిచారని అన్నారు. శనివారం గెలుపొందిన విద్యార్థులకు ఒకేషనల్ ట్రైనర్ సాంబకృష్ణ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పీఈటీ దేవేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో హెచ్ఎం చెన్నకేశ్వరి

మొంథా ధాటికి రైతన్న విలవిల

- 1200 ఎకరాల్లో దెబ్బతిన్న వరి పంట
- రూ.8కోట్ల నష్టం

సంజామల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ధాటికి అన్నదాతలు విలవిలలాడుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు చేతికి వచ్చిన వరి పంట నేలవాలింది. దాదాపు 1200 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. మండల వ్యాప్తం గా ఖరీఫ్‌లో 3,480 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. పాలేరువాగు పరివాహక గ్రామాలైన హోత్రమాన్‌దిన్నె, వసంతా పురం, బొందలదిన్నె, కమలపురి, ముదిగేడు, ముక్కమళ్ల, ముచ్చలపురి, ఎగ్గోని, కొత్తపేట, సంజామల గ్రామాల్లోనే దాదాపు 1800 ఎకరాల్లో వరి పంట సాగైంది. ఓ పక్క ఎడతెరిపి లేని వర్షాలు మరోపక్క పాలేరువాగు ఉప్పొంగ డంతో పరివాహకంలో భారీగా పంట నష్టం జరిగింది. నాట్లు మొదలుకొని నాలుగు దఫాలుగా ఎరువులు క్రిమిసంహారక మందులు పిచికారి చేసి కంకి దశలో తీరా చేతికి వచ్చాక పంట నేలవాలి వరద ముంపునకు గురైందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరానికి 35 నుంచి 40 బస్తాల దిగుబడినిచ్చే పంట చేతికి అందకుండా పోవడంతో వరి రైతులు విలపిస్తున్నారు. బస్తా రూ.1600లకు విక్రయించినా మండల వ్యాప్తంగా 8కోట్ల నష్టం వాటిల్లిందని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించి ఆదుకోవాలి.



దెబ్బతిన్న వరి పంట

పంట నష్టం అంచనా వేసి నివేదించాం



మండల వ్యాప్తంగా మొంథా తుఫాన్ అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించాం. పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాం భారీగా వరి పంట దెబ్బ తింది. మొక్కజొన్న, మిరప, పత్తి పంటలు దెబ్బ తిన్నాయి.

● జ్యోతి, ఏవో

5 ఎకరాల్లో వరి ముంపునకు గురైంది



ఐదు ఎకరాల్లో సాగు చేసిన వరి పంట పాలేరువాగు ముంపునకు గురైంది. నాలుగు దఫాలుగా ఎరువులు, క్రిమిసంహారక మందులకు ఎకరానికి రూ. 30వేలు పైబడే పెట్టుబడిగా పెట్టాం. పంట కంకి దశలో వదర ఉధృతికి గురై భారీ నష్టపోయాను.

● చంద్రశేఖర్ రెడ్డి, రైతు, కమలపురి

శాశ్వత పరిష్కారం చూపండి



ప్రతి ఏటా పాలేరువాగు ఉప్పొంగడం పరివాహకంలో వరి పంట ముంపునకు గురవుతోంది. శాశ్వత పరిష్కారం చూపితే ప్రతి ఏటా నష్టలు రావు. పాలేరువాగు విస్తరణ పనులు జరిగితే పరివాహకంలో ఏ రైతు సాగు చేసిన పంటలు ముంపునకు గురికావు. 6 ఎకరాల్లో వరి పంట వరద ముంపునకు గురైంది.

● వెంకటేశ్వర రెడ్డి, రైతు, కమలపురి

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో హెచ్ఎం, అధ్యాపకులు

ఆళ్లగడ్డ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అధ్యాపకులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం వీరరాఘవయ్య అన్నారు. శనివారం జిల్లా స్థాయి స్కిల్ కాంపిటేషన్‌లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ నంద్యాల జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి ఒకేషనల్ స్కిల్ కాంపిటేషన్‌లో పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు రెండు ట్రేడ్స్‌కు సంబంధించిన ఎలక్ట్రానిక్స్, ఐటిఐటి ఈఎస్ కు సంబంధించిన ప్రాజెక్టుని ప్రదర్శించారన్నారు. ఇందులో ఐటిఐటిఈఎస్, ఎలక్ట్రానిక్స్‌లో జిల్లా లో ప్రథమ బహుమతి లభించిందన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, ప్రోత్సహించిన ఉపాధ్యాయులు అశోక్, అక్బర్‌లను హెచ్ఎం అభినందించారు.

నేడు రెడ్ల సంక్షేమ సంఘం కార్తీక వనభోజనం

డోన్ టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న కోట్ల విజయభాస్కర్ రెడ్డి భవనం (రెడ్ల భవనం)లో ఆదివారం రెడ్ల సంక్షేమ సంఘం కార్తీక మాస వనభోజనాన్ని నిర్వహిస్తున్నట్లు శనివారం సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు గోమాత పూజ, ఉసిరిక వృక్షం పూజా కార్యక్రమాలు నిర్వహించి 10 గంటలకు అతిథులచే కార్తీకమాస విశిష్టత ఉపన్యాసం జరుగుతుందన్నారు. జానపద గాయకుడు జంగిరెడ్డి ఫోక్ బ్యాండ్ బృందంచే పలు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు రేలారే రేలా భక్తి సినిమా పాటల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు వనభోజనం, సాయంత్రం 4 గంటలకు ముగింపు వేడుకలు జరుగుతాయన్నారు. డోన్ పాతబస్టాండు నుంచి రెడ్ల భవనం వరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

డోన్ రూరల్/డోన్ టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాంబ శివాలయంలో ఉపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డికి భక్తులు శాలువలు, పూలమాలలుతో సత్కరించారు. డోన్ పాతపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న వెంకటసు బ్బారెడ్డి సాంబ శివాలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని ఆలయ ప్రధాన పురోహితుడు కళ్లె శేషావలి శర్మ తెలిపారు. ఇటీవల పదోన్నతిపై ఆలూరు నియోజకవర్గంలోని విరుపాపురంకు బదిలీపై వెళ్లడంతో ఈ సందర్భంగా ఆయన్ను డోన్ సాంబశివాలయం భక్తులు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, నాగభూ షణం రెడ్డి, హనుమంతరెడ్డి, రామేశ్వరరావు, నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి, జక్కా మధుసూదన్ గుప్తా, రఘురాంరెడ్డి పాల్గొన్నారు.

కలంకారీ కళాకారుడికి అవార్డు

బనగానపల్లె, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన కలంకారీ కళాకారుడు శివప్రసాద్‌రెడ్డి జాతీయ కాళిదాసు సాంస్కృతిక అకాడమీ తరపున మధ్యప్రదేశ్ ప్రభుత్వం నుంచి కాళిదాసు అవార్డు అందుకున్నారు. సాంప్రదాయ కళాకా రులకు నిర్వహించిన పోటీల్లో విజేతగా నిలిచారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఖ్యాతి పొందిన కాళిదాసు అవార్డును అందుకున్నారు. మహాకవి కాళిదాసు రచించిన మాళవికాగ్ని మిత్రం అనే గ్రంథం ఆధారంగా మాళవిక, అగ్నిమిత్రుడు సంబంధించిన ప్రేమ కథ లకు సంబంధించిన చిత్రాలను కలంకారీ చిత్రాలుగా వేసి ఈ అవార్డు అందుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రి గౌతం చేతులమీదుగా రూ.లక్ష నగదు, ప్రశంసాపత్రం అందుకున్నారు. శివప్రసాద్‌రెడ్డి మాట్లా డుతూ మాళవికాగ్ని మిత్రం అనే గ్రంధానికి సంబంధించి తాను వేసిన కలంకారీ చిత్రాలకు గాను ఈ అవార్డు లభించిందన్నారు.



అవార్డు అందుకుంటున్న టంగుటూరు శివప్రసాద్‌రెడ్డి

బేతంచెర్ల చేరుకున్న బస్సు యాత్ర

బేతంచెర్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తలపెట్టిన బస్సు యాత్ర శనివారం బేతంచెర్లకు చేరుకుంది. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వల రాజు, నాసర్‌జీ మాట్లాడుతూ బస్సు యాత్ర 22వ తేదీ ఇచ్ఛాపురం నుంచి నవంబరు 12వ తేదీ హిందూపురం వరకు సాగుతుందన్నారు. ఇందులో భాగంగా బేతంచెర్లలో ఎంజేపీలో నిర్వ హించామన్నారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని, ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ప్రైవే టీకరణ ఆపాలని, జీవో.77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యన్నా ఉదయ్, ఎస్ఎఫ్ యూ జిల్లా కార్యదర్శి ఆజాంబేగ్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు మస్తాన్, నాగభూషణం, కుల్లాయి స్వామి, ఉపాధ్యక్షులు ఫణిధర్ పాల్గొన్నారు.

ముగిసిన వైద్య శిబిరం

సంజామల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కానాల గ్రామం లోని సెవెన్ డే చర్చిలో ఏర్పాటు చేసి ఉచిత వైద్యశిబిరాలు శనివారంతో ముగిశాయి. అమెరికా వైద్యులు డాక్టర్ పెడ్రో మరియా, గోనిలు రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అమెరికన్ డాక్టర్లకు కోవెలకుంట్ల దంత వైద్యుడు పేరా శ్రీధర్ రెడ్డి తనవంతు సహాయ సహకారాలు అందించారు. అమెరికన్ డాక్టర్లతో పా టు పేరా శ్రీధర్ రెడ్డిలను చర్చి కమిటీ అధ్యక్షుడు సామెల్‌పాల్, కార్యదర్శి సామెల్ నారాయణ, ట్రెజరర్ కిరణ్ కుమార్, గ్రామస్థులు సన్మానించారు.

విద్యార్థుల ప్రతిభ

చాగలమర్రి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా స్థాయిలో జరిగిన స్కిల్ కాంపిటేషన్ పోటీల్లో చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం జీవయ్య తెలిపారు. శనివారం విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఐటీ ట్రైనర్లు బాలయ్య, జీవీకె రెడ్డి పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

బేతంచెర్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 17, 18వ తేదీల్లో జరిగే సీఐటీయూ 3వ జిల్లా మహాసభలను జయప్రదం చేయా లని బేతంచెర్ల మండల లారీ మోటార్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం పట్టణంలో సీఐటీయు కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఎల్లయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. నాయకులు ఎస్.సాధిక్ హుశేన్, అధ్యక్ష కార్యదర్శులు ఎల్లయ్య, రామాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 129 కార్మిక చట్టాలను కేవలం నాలుగు లేబర్ కోడ్లుగా చేసి భూస్వామ్య కార్పొరేట్ శక్తులకు కార్మిక చట్టాలను అనుకూ లంగా మార్చడం దుర్మార్గమన్నారు. నాయకులు జలంధర్, మద్దిలేటి స్వామి, వన్నూరు, జె.మద్దయ్య, మల్లికార్జున, గురు స్వామి, వెంకటేశ్వర నాయక్, మహబూబ్ బాషా, మాలిక్ బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామాంజనేయులు

ముగిసిన ఉపాధ్యాయ శిక్షణ



ఉపాధ్యాయులకు పత్రాలు అందజేస్తున్న ఎంఈవో

కొలిమిగుండ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా ఉపాధ్యాయులకు జరుగు తున్న టీచ్ టూల్ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షణ పొందిన అబ్జర్వర్లకు మండల విద్యాధికారి అబ్దుల్ కలాం పత్రాలను పంపిణీ చేశారు. శిక్షణ పొందిన అబ్జర్వర్లు ప్రతి నెల రెండు విడతలుగా పాఠశాలలకు వెళ్లి ఉపా ధ్యాయులకు ట్రైనింగ్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు హుసేనయ్య, ట్రైనర్లు పాండురంగారెడ్డి, దాని యల్, సీఆర్పీ రాజేష్ పాల్గొన్నారు.

అరటి ధర పతనం

టన్ను రూ.4వేలు



రుద్రవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అరటి ధర పతనమైంది. గతంలో సుమారు 12వేల నుంచి 15వేల వరకు రేటు పలికిందని మండలంలోని ఆలమూరు రైతులు హుసేనీ, మహ్మద్, శంకర్, బ్రహ్మయ్య తెలిపారు. ప్రస్తుతం టన్ను అరటి రూ.4వేలు పడిందన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

రుద్రవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొండమాయపల్లె, వెలగలపల్లె, చిన్నకంబలూరు గ్రామల సమీపంలో మొక్కజొన్న, వరి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 12న రైతుల సమస్యలపై ఆళ్లగడ్డ వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని, రైతులు పాల్గొని ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

రుద్రవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు శనివారం తెలిపారు. నంద్యాల జిల్లాలో ఈనెల 7న జరిగిన జిల్లా స్కిల్ పోటీల్లో అగ్రికల్చర్ విభాగంలో విద్యార్థినులు స్పందన, లహరి, మధూరి, రాజేశ్వర్విలు రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. సోలార్ పవర్ స్మార్ట్ఇరిగేషన్ ఇన్నోవేటివ్ ప్రాజెక్టు జిల్లాస్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించిందన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

కొలిమిగుండ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ నాయకులు సూరి, వినయ్, గుజ్జల పెద్దయ్య డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ మొక్కజొన్న రైతులు తుఫాన్ ప్రభా వంతో తీవ్రంగా నష్టపోయారని, తడిచిన ధాన్యాన్ని రూ. 3వేల మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వెంకటరమణ, కంబగిరిస్వామి, చంటి, రమణ పాల్గొన్నారు.

దెబ్బతిన్న రహదారి రక్షణ గోడ

ప్యాపిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్ నగరం రహదారి సమీపంలోని లోయకు ఏర్పాటు చేసిన రక్షణ గోడ దెబ్బతింది. ప్యాపిలి నుంచి బనగానపల్లి రహదారి మార్గంలో ఈ లోయ ఉంది. నిత్యం పదుల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన రక్షణ గోడ దెబ్బతింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు.



ఘనంగా కార్తీక దీపోత్సవం



జ్వాలాతోరణంలో పాల్గొన్న భక్తులు

అవుకు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకొని అవుకు పట్టణంలో వెలసిన భూలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో జ్వాలాతోరణం, కార్తీక దీపోత్సవం శనివారం నిర్వహించారు. అర్చకులు వెంకటరమణచార్యులు, శ్రీధర్ స్వామి వారిని పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ఆలయం చుట్టూ ఊరేగించారు. రాత్రి 6-45 గంటలకు జ్వాలతోరణం నిర్వహించారు. మహిళలు భారీగా తరలివచ్చి ఆలయం వద్ద కార్తీక దీపాలను వెలిగించారు.

ఆలయాల్లో పూజలు

రుద్రవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా మండలంలోని వాసాపురం, ఉల్లెడకొండ, భాస్కర నందీశ్వరం ఆల యాల్లో పూజలు చేసి వెలిగించారు. అలాగే డి.కొట్టాల, యల్లావత్తుల, గుట్టకొండ, దొర్ని క్షేత్రాల్లో కూడా మహిళలు దీపాలు వెలిగించారు.

గౌరమ్మకు..

చాగలమర్రి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ప్రతిష్ఠించిన గౌరమ్మ ప్రతిమకు శనివారం మహిళలు పూజలు చేశారు. బుగ్గమల్లే శ్వర ఆలయంలో ఆదివారం కార్తీక వనభోజనం, గౌరమ్మ నిమజ్జనం జరుగుతుందని ఆలయ ధర్మకర్త లక్ష్మణబాబు తెలిపారు.

మాలధారులకు భిక్ష

కోవెలకుంట్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా మాలధారు లకు శనివారం భిక్ష ఏర్పాటు చేసినట్లు గురుస్వాములు మురళీక్రిష్ణ, గడ్డం నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ కార్తీక మాసం నుంచి ప్రతిరోజూ అయ్యప్ప మాలధారులకు దాతల సహకారంతో భిక్ష ఏర్పాటు చేస్తున్నామ న్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని రేవనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు సుభాన్ ప్రజలకు సూచించారు. శనివారం రేవనూరు పీహెచ్‌సీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో నీరు నిల్వ చేరి దోమలు వృద్ధి చెంది అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా వేస్ట్ ఆయిల్ చల్లి పరి సరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

చాగలమర్రి: చెంచులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యశాఖ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి సూచించారు. శనివారం చాగలమ్మ చెంచు కాలనీలో చెంచులకు వివిధ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి ముఖచిత్రాలను తీసి యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం గార్లేట్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకుల మౌన దీక్షను జయప్రదం చేయండి

కొలిమిగుండ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో ఆదివారం జరిగే వాల్మీకుల మౌన దీక్షను జయప్రదం చేయాలని వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్ గోపాల్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ వాల్మీకుల ఎస్టీ పునఃరుద్ధరణే ప్రధాన ధ్యేయంగా ఆ సమితి మౌనదీక్షను ఏర్పాటు చేసిందని అన్నారు. కార్యక్ర మంలో పెద్దయ్య, కంబగిరిస్వామి, రామ్మూర్తి, సుధాకర్, వెంకటరమణ, రవి, సాయి పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగురుచుకోవాలి

చాగలమర్రి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బోధన నైపుణ్యాలను ఉపాధ్యాయులు మెరుగుపరుచుకోవాలని రిసోర్స్‌పర్సన్ నారాయణ మూర్తి తెలిపారు. శనివారం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో టీచ్ టూల్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ శిక్షణలో ఇచ్చిన అంశాలను తరగతి గదిలో విద్యార్థులకు బోధించాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు జీవయ్య, సుబ్బరాయుడు, ట్రైనర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశు వైద్యశాల తనిఖీ

సంజామల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కమళ్ల గ్రామంలోని పశువైద్యశాలను పశుసంవర్ధకశాఖ ఏడీ కొండారెడ్డి శనివా రం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేయ్యదూడల పెంపకంపై పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. బర్రెలు ఎదకు వచ్చిన ప్పుడు కృత్రిమ గర్భాధారణకు సంబంధించి ట్రిపుల్ ఎక్స్ సెమెన్ గర్భాధారణ చేయాలన్నారు. ఈ సెమెన్ ద్వార బర్రె పేయదూడను జన్మ నిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణకుమార్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ శ్రీనివాస రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్నులు ఆన్‌లైన్‌లో చెల్లించాలి

కొలిమిగుండ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు ఇంటి పన్నులు ఆన్‌లైన్‌లో చెల్లించాలని డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి శనివారం తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.